క్లుప్తంగా

కవితలు, కథల పోటీలకు మధుశ్రీ కథ ఎంపిక


కె.మధుశ్రీ

కామారెడ్డి అర్బన్: పూరి మళ్ల ఫౌండేషన్(ఖమ్మం) ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కవితలు, కథల పోటీలకు కామారెడ్డి మండలం లింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని కె.మధుశ్రీ ఎంపికైంది. కె.మధుశ్రీ 'నాయనమ్మ చెప్పిన కథ' పేరిట నాలుగు పేజీల కథను రాసి పంపించగా ఎంపికైనట్టు పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు ఎస్.సునీత తెలిపారు. పోటీల్లో ఎంపికైన కథలు, కవితలను సంకలనంగా ముద్రిస్తారని సునీత పేర్కొన్నారు. మధుశ్రీని పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



బాన్సువాడ రూరల్: కొల్లూర్‌లో ఆదివారం బాన్సువాడ డీఎల్పీవో వెంకట సత్యనారాయణరెడ్డి పర్యటించారు. గ్రామంలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. ఇప్పటికే బేస్‌మెంట్ వరకు నిర్మాణాలు చేపట్టిన వారు మిగులు పనులు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం లబ్ధిదారులకు 5 దశల్లో రూ.5 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. పంచాయతీ కార్యదర్శి సృజన్‌రెడ్డి ఉన్నారు.

భగవద్గీత శ్లోకాల పుస్తకాల పంపిణీ



బాన్సువాడ: శ్రీ కృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని ఆదివారం బాన్సువాడ అయ్యప్ప ఆలయంలో భగవద్గీత శ్లోకాల పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. పవిత్ర, అనురాధ, భాగ్యలక్ష్మిల ఆధ్వర్యంలో పిల్లలకు భగవద్గీత పుస్తకాలు అందజేశారు. చిన్నప్పటి నుంచే పిల్లలు భగవద్గీత పుస్తకాలు చదవాలని, సనాతన ధర్మం గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని వారు అన్నారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత చదివేలా అవగాహన కల్పించాలని అన్నారు.

ఏచూరి సంస్మరణ సభను విజయవంతం చేయాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): కామారెడ్డి పట్టణ కేంద్రంలోని మున్నూరుకాపు సంఘంలో మంగళవారం(19న) నిర్వహించే సీతారాం ఏచూరి సంస్మరణ సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన లింగంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులు, కార్మికులనుద్దేశించి మాట్లాడారు. సీతారాం ఏచూరి భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టుకు మాత్రమే నాయకుడు కాకుండా ప్రపంచ కమ్యూనిస్టు పార్టీలకు దిక్సూచిగా, మార్గదర్శకుడిలా పనిచేశాడని కొనియాడారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా అవార్డు పొందారని గుర్తు చేశారు. సంస్మరణ సభకు రాష్ట్ర సీపీఎం కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్‌రాములు హాజరవుతున్నట్లు తెలిపారు. నేతలు చంద్రశేఖర్, సావిత్రి, నాన్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంగా రైతుల సమస్యలపై పోరాడాలి



రామారెడ్డి: రైతులందరూ ఐకమత్యంగా సమస్యలపై పోరాడాలని కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గైని నరేష్ పిలుపునిచ్చారు. ఆదివారం పోసానిపేట రైతు వేదికలో కిసాన్ సంఘ్ శిక్షణ సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతులు సంఘంగా సంఘటితమై ఐకమత్యంగా రైతుల సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. అన్ని గ్రామాలలో రైతు సంఘాలు పెట్టుకోవాలని సంఘం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. పార్టీలు సిద్ధాంతాలు వేరైనా రైతులంతా ఒకటేనని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబి ఆనంద్ రావు, రాష్ట్ర సంఘటన మంత్రి రాజారెడ్డి, జిల్లా అధ్యక్షులు పైడి విట్టల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సాయిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్రావు, కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

ఎండలో ఎండుతూ..వానలో తడుస్తూ

- రామారెడ్డిలో ప్రయాణికులకు తప్పని తిప్పలు
- బస్టాండ్‌లో మౌలిక వసతులు కరువు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు


శిథిలావస్థకు చేరిన రామారెడ్డి బస్టాండ్


రామారెడ్డి బస్టాండ్ ప్రాంతంలో రోడ్డుపై వేచి ఉన్న ప్రయాణికులు

రామారెడ్డి: రామారెడ్డి గ్రామం 2016 అక్టోబర్ 11న నూతన మండలంగా ఏర్పడింది. తొమ్మిదేళ్లు గడుస్తున్నా మండల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ప్రముఖ పుణ్యక్షేత్రం కాలభైరవ ఆలయం, బుగ్గ రామలింగేశ్వర గుడి రామారెడ్డి మండలంలోనే ఉన్నాయి. ఈ రెండు ప్రముఖ ఆలయాలు. వివిధ జిల్లాలు రాష్ట్రాల నుంచి నిత్యం భక్తులు పెద్ద సంఖ్యలో ఈ ఆలయాలకు వస్తుంటారు. అలాంటి మండల కేంద్రంలోని బస్టాండులో సరైన వసతులు లేక ప్రయాణికులు వానకు తడుస్తూ ఎండకు ఎండుతో దుకాణాల మాటున ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. మౌలిక వసతులు కల్పించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారు. వివిధ పనుల నిమిత్తం రామారెడ్డికి వచ్చే పోయే ప్రయాణికులకు బస్టాండ్‌లో వసతుల లేమి ఇబ్బందికరంగా మారింది. రోడ్డుపై నిలబడి ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. అలాగే రెడ్డిపేటలో కూడా ప్రయాణికుల కోసం రేకుల షెడ్డు కూడా లేకపోవడంతో రోడ్డుపై నిలబడుతున్నారు. శిథిలావస్థకు చేరిన రామారెడ్డి బస్టాండ్ యాచకులు, నిరాశ్రయులకు ఆశ్రమంగా మారిపోయింది. ఆర్టీసీ శాఖ కనీసం బస్టాండ్‌ను పట్టించుకోవడం మర్చిపోయింది. మరుగుదొడ్లు లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి రామారెడ్డితో పాటు పరిధిలోని గ్రామాలలో బస్టాండులు నిర్మించాలని.. అలాగే బస్టాండ్లలో మరుగుదొడ్ల వసతి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

వసతులు కల్పించాలి



రామారెడ్డి బస్టాండ్ యాచకులకు ఆశ్రమంగా మారింది. మరుగుదొడ్లు లేవు. మహిళా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు పట్టించుకుని బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలి.

– కట్టు ఈశ్వర్ కుమార్, రామారెడ్డి

తాత్కాలిక షెడ్డును నిర్మించాలి



మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో బస్టాండ్‌లు లేక రోడ్ల మీద నిలబడి ప్రయాణాలు కొనసాగించాల్సి వస్తోంది. వానాకాలంలో ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. అధికారులు స్పందించాలి.

–బాన్సీ, రాజమ్మ తండా

ప్రయాణం నరకప్రాయమే..!


కస్తూర్బా పాఠశాలకు వెళ్లే రోడ్డు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి– చందాపూర్ రహదారి నుంచి కస్తూర్బా పాఠశాలకు వెళ్లే రోడ్డు బురదమయంగా మారడంతో సిబ్బంది, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షం కురిస్తే చాలు ఈ రోడ్డు బురదగా మారి గుంతలుగా ఏర్పడుతున్నాయి. రోడ్డుపై నాసిరకం మొరం పోయడంతో ఈ విధంగా తయారైందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేకుండా పోయిందన్నారు. అధికారులు పట్టించుకొని ఈ రోడ్డును బాగు చేయించాలని పాఠశాల సిబ్బంది కోరుతున్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది సమ్మేళనం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎర్రాపహాడ్ రెడ్డి సంఘ భవనంలో ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ శాఖ ఆధ్వర్యంలో శతాబ్ది హిందూ కార్యకర్తల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ తాడ్వాయి ఖండ కార్యవాహ మారుతీరావు మాట్లాడుతూ.. యువకులు దేశభక్తిని కలిగి ఉండి హిందూ సమాజాన్ని మరింత ముందుకు తీసుకుపోవాలన్నారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యువకులు మనస్సును ఇతర చెడు అలవాట్లకు వెళ్లకుండా మంచిమార్గంలో నడిచేలా సూచనలు చేశారు.

కురుస్తున్న వర్షాలు..పొంగుతున్న అలుగులు


పొంగిపొర్లుతున్న బోర్లం తోరచెరువు అలుగులు

బాన్సువాడ రూరల్: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువులు దాదాపు నిండాయి. చెరువుల్లో భారీగా నీరు చేరడంతో అలుగులు పొంగిపొర్లుతున్నాయి. చెరువులకు బుంగలు, గండ్లు పడకుండా నీటిపారుదల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు చెరువుల స్థితిగతులను తెలుసుకుంటున్నారు.

శాంతించిన కన్నాపూర్ మత్తడి వాగు

రామారెడ్డి: వర్షాలకు రామారెడ్డి మండలంలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కన్నాపూర్ మత్తడి వాగు నీటి ప్రవాహ వేగం పెరగడంతో శనివారం రోడ్డు మార్గాన్ని పోలీసులు, రెవెన్యూ శాఖాధికారులు బంద్ చేశారు. ఈ మార్గం గుండా కన్నాపురం ప్రజలు కామారెడ్డికి వెళ్తుంటారు. ఆదివారం వర్షాలు కురువకపోవడంతో మత్తడి వాగు నీటి ప్రవాహం తగ్గిపోయింది. దీంతో రాకపోకలు మళ్లీ ప్రారంభమయ్యాయి.

వర్షాలు తగ్గుముఖం.. రహదారుల పునరుద్ధరణ

మద్నూర్(జుక్కల్): ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షాలు ఆదివారం తగ్గుముఖం పట్టడంతో రహదారులను పునరుద్ధరించారు. డోంగ్లీ మండలంలోని లింబుర్–లింబుర్ వాడి గ్రామాల మధ్యలోని వాగులో వరద నీరు తగ్గుముఖం పట్టడంతో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. రహదారిపై మోకాళ్ల లోతు బురద పేరుకుపోయిందని కాలినడకన తప్ప ద్విచక్ర వాహనంపై వెళ్లలేని పరిస్థితి నెలకొందని లింబుర్‌వాడి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డోంగ్లీ నుంచి కుర్లా ప్రధాన రహదారిపై వరద నీరు తగ్గిపోవడంతో రాకపోకలు సాగుతున్నాయి. మద్నూర్ మండలంలోని అంతాపూర్ వద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతో అధికారులు రహదారిని బాగు చేసి మద్నూర్–జుక్కల్‌కు రాకపోకలను పునరుద్ధరించారు.

ధ్వంసమైన రహదారులు

భారీ వర్షాల కారణంగా మండలంలోని పలు గ్రామాల రహదారులు ధ్వంసమయ్యాయి. మండలంలోని గోజెగావ్, కోడిచిర, చిన్న ఎక్లార, దన్నూర్, సోమూర్,డోంగ్లీ మండలంలోని కుర్లా, ఎన్‌బుర, మదన్‌హిప్పర్గా గ్రామాలకు వెళ్లే రహదారులు కంకర తేలి ప్రమాదకరంగా మారాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారులను బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.


కుర్లా వద్ద వరద నీరు తగ్గిపోవడంతో తేలిన రోడ్డు


వర్షంతో గుంతలమయమైన గోజేగావ్ రోడ్డు

భక్తి శ్రద్ధలతో తీజ్ ఉత్సవాలు


శేర్‌శంకర్ తండాలో తీజ్ ఉత్సవాలు జరుపుకుంటున్న గిరిజన యువతులు

రాజంపేట: శేర్‌శంక్ తండాలో ఆదివారం తీజ్ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. గిరిజన సంస్కృతికి ప్రతీకగా తీజ్ పండగను శ్రావణ మాసంలో జరుపుకుంటారు. ఈ ఉత్సవాల్లో భాగంగా యువతులు 9 రోజుల పాటు గోధుమ నారుకు నీరు పోస్తూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. చివరి రోజు యువతులు మొలకల బుట్టలను నెత్తిపై పెట్టుకుని కుటుంబ సభ్యులతో కలిసి నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా వెళ్లి స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.

బస్టాండ్ రూపురేఖలు మార్చిన వ్యక్తికి సన్మానం



భిక్కనూరు: మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరిన బస్టాండ్‌ను తన సొంత నిధులు రూ.1.25 లక్షలు వెచ్చించి బాగు చేసిన జ్ఞానప్రకాశ్‌రెడ్డిని భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని రామగల్ల అలేఖ్య, పదవ తరగతి చదువుతున్న అవంతికలు ఆదివారం సన్మానించారు. ప్రకాశ్‌రెడ్డి.. సిద్దరామేశ్వరాలయనికి వెళ్లే సర్వీస్ రోడ్డును కూడా రూ.1.70 లక్షలు వెచ్చించి భక్తుల ఇక్కట్లను తొలగించాడని విద్యార్థినులు చెప్పారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ ప్రజావాణి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని విద్యుత్ శాఖ డీఈ కార్యాలయంలో సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈ విజయ సారథి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏవైనా సమస్యలుంటే ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదు చేయవచ్చని అన్నారు.

గురుకుల పాఠశాలలో నేడు స్పాట్ అడ్మిషన్లు

ఎల్లారెడ్డిరూరల్: నిజామాబాద్ జిల్లాలోని పెర్కిట్ చీమన్‌పల్లి గిరిజన గురుకుల పాఠశాలలో సోమవారం 5 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఎల్లారెడ్డి గిరిజన బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ప్రమీల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు వారి ఒరిజినల్ ధ్రువపత్రాలతో చీమన్‌పల్లిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావాలని ఆమె తెలిపారు.

సంక్షిప్తం

పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలి

ఎల్లారెడ్డిరూరల్: గ్రామాలలో పారిశుద్ధ్యం లోపించకుండా తగిన చర్యలు తీసుకోవాలని డీపీవో మురళి అన్నారు. ఆదివారం మాచాపూర్, సబ్దల్‌పూర్ గ్రామాలోని మురికి కాలువలను ఆయన పరిశీలించారు. తీవ్రంగా వర్షాలు కురుస్తున్నందున చెత్త అడ్డుపడి నీరు నిలిచి ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, మంచి నీటిలో బ్లీచింగ్ పౌడర్ కలపాలని అన్నారు. ఎంపీడీవో ప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

వాహనాల తనిఖీ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో పోలీసులు ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. పెండింగ్ చలాన్లుఆన్‌లైన్‌లో చెల్లించాలని ఎస్సై మహేష్ కోరారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. వాహనదారులు ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని, కచ్చితంగా హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ అన్నారు. ఆయన ఆదివారం తాడ్వాయి మండల కేంద్రంతో పాటు కృష్ణాజీవాడిలో పర్యటించారు. గ్రామ కార్యదర్శులు, కారోబారులు, జీపీ సిబ్బంది గ్రామాలలో తిరుగుతూ సమస్యలను గుర్తించి సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులను 100 శాతం వసూలు చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఐడియా అదిరింది



భిక్కనూరు: కోతుల నుంచి తమ డిష్ యాంటెన్నాలను కాపాడుకునేందుకు కొందరికి వినూత్న ఆలోచన వచ్చింది. మండల కేంద్రంతో పాటు రామేశ్వర్‌పల్లిలో కొందరూ డిష్ యాంటెన్నాలపై మేకులను అతికించారు. యాంటెన్నాపై గెంతులేసే కోతులకు ఈ మేకులు గుచ్చుకోవడంతో అవి ఆ వైపు పోవడం లేదు. భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన నాగరాజు అనే డిష్ మెకానిక్ రూ.500 తీసుకుని యాంటెన్నాలపై ఎంసీల్‌తో మేకులను అతికిస్తున్నాడు.

ఆలయ అభివృద్ధికి విరాళం

మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీనృసింహ స్వామి ఆలయ అభివృద్ధి కోసం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సౌజన్య, లింబాద్రి దంపతులు ఆదివారం రూ 16 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దాతలకు స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించి సన్మానించారు.

నిధులు లేక నిలిచిన పనులు

- అర్ధంతరంగా ఆగిన మీర్జాపూర్ లైబ్రరీ భవన నిర్మాణ పనులు
- మరో రూ.5 లక్షలు అవసరమంటున్న కాంట్రాక్టర్


మీర్జాపూర్‌లో నిలిచిపోయిన గ్రంథాలయ భవన నిర్మాణ పనులు

నస్రుల్లాబాద్: మీర్జాపూర్‌లో గ్రంథాలయ భవన నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. రెండేళ్ల క్రితం రూ.10 లక్షలతో గ్రామ పంచాయతీ భవనంపైన నిర్మాణం చేపట్టారు. కాంట్రాక్టర్ పనులు చేస్తుండగా నిధులు సరిపోకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆపేశారు. దీనితో గ్రామంలో యువకులు సుదూర ప్రాంతాలకు వెళ్లి పోటీ ప్రవేశ పరీక్షలకు సిద్ధం కావాల్సి వస్తోంది. గ్రామం నుంచి నిజామాబాద్, బాన్సువాడ, బోధన్ వంటి ప్రాంతాలకు వెళ్తున్నారు. ఉదయం వెళ్లి ఇంటికి తిరిగి రావడానికి రాత్రి అవుతోంది. గ్రంథాలయం భవన నిర్మాణం పూర్తి చేయాలంటే మరో రూ.5 లక్షలు అవసరం ఉంటుందని కాంట్రాక్టర్ అంటున్నారు. కేవలం స్లాబు, గోడలు మాత్రమే నిర్మించారు. నిధులు చాలక ప్లాస్టింగ్ కూడా చేయలేదు. స్థానిక నాయకులు, ఉన్నతాధికారులు స్పందించి భవనం పూర్తి చేసి ఇవ్వాలని గ్రామ నిరుద్యోగులు కోరుతున్నారు.

సమయం వృథా అవుతోంది

భవనం పూర్తి కాకపోవడంతో యువకులు చదువుకోవడానికి సుదూర ప్రాంతాలకు వెళ్తున్నారు. ప్రయాణంతోనే సమయం వృథా అవుతోంది. గ్రామంలో అర్ధంతరంగా నిలిచిన లైబ్రరీని పూర్తి చేస్తే బాగుంటుంది.

– పుట్ట భాస్కర్, యువకుడు, మీర్జాపూర్

శాంతియుతంగా గణేశ్ ఉత్సవాలు జరుపుకోవాలి


భిక్కనూరులో గణేష్ మండపాల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎస్సై ఆంజనేయులు


పెద్దకొడప్‌గల్‌లో.. ఎస్సై అరుణ్ కుమార్

సాక్షినెట్‌వర్క్:గణేశ్ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని పోలీసులు సూచించారు. గణపతి ఉత్సవాల నేపథ్యంలో ఆదివారం భిక్కనూరు, పెద్ద కొడప్‌గల్, రాజంపేట, మద్నూర్ మండల కేంద్రాల్లో ఎస్సైలు ఆంజనేయులు, అరుణ్‌కుమార్, దత్తాత్రి గౌడ్, విజయ్‌కొండలు వివిధ గ్రామాలలోని గణపతి మండపాల నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద ప్రతిరోజూ ఇద్దరు వ్యక్తులు ఉండేలా చూసుకోవాలన్నారు. ఇతరులకు ఇబ్బంది కలిగేలా లౌడ్‌స్పీకర్లను వాడొద్దని సూచించారు. గణేష్ నిమజ్జనం రోజున నెంబర్ ప్రకారం వరుసగా వెళ్లాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ వినాయక ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. స్థానిక తహసీల్దార్‌లు, కార్యదర్శులు, పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.


రాజంపేటలో.. ఇన్‌చార్జి ఎస్సై దత్తాద్రి గౌడ్


మద్నూర్‌లో.. ఎస్సై విజయ్‌కొండ

నూతన కార్యవర్గాల ఎన్నిక

దోమకొండ పద్మశాలి సంఘం కార్యవర్గం



దోమకొండ: దోమకొండ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఐరేని నర్సయ్య, మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు బత్తిని సిద్ధరాములు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మ్యాక నాగరాజు, ఉపాధ్యక్షులుగా ఐరేని రాజేందర్, బొమ్మెర ప్రవీణ్, కుందేన వినోద్, ప్రధాన కార్యదర్శిగా బొమ్మెర గంగాధర్, సహాయ కార్యదర్శులుగా కూచని జగదీశ్, శ్రీగాధ మహదేవ్, చాట్ల అనిల్, కోశాధికారిగా అందె గణేష్‌లను ఎన్నుకున్నారు.

సాధుసంత్ మహరాజ్‌ల జిల్లా కమిటీ ఏకగ్రీవం



కామారెడ్డి అర్బన్: శ్రీసాధుసంత్ మహరాజ్ కామారెడ్డి జిల్లా కమిటీని నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు నారాయణ మహరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీసాధుసంత్ మహారాజ్ జిల్లా అధ్యక్షుడిగా సలావత్ రాజు మహరాజ్, ప్రధాన కార్యదర్శిగా రామావత్ సేవ్యా మహరాజ్, కోశాధికారిగా బానోత్ గోపి మహరాజ్, ప్రచార కార్యదర్శిగా బానోత్ రాజు మహరాజ్, కార్యదర్శిగా నూనవత్ బావ్‌సింగ్ మహరాజ్, సలహాదారులుగా రెడ్యా, పూల్యా, ధనరాజ్, సక్రు, బలరాం, రవి మహరాజ్‌లు ఎన్నికయ్యారు. ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు చరణ్ మహరాజ్, లంబాడ హక్కుల సమి తి జిల్లా అధ్యక్షుడు గణేష్ నాయక్, ప్రతినిధులు శ్రీనునాయక్, రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

అంతంపల్లి గ్రామాభివృద్ధి కార్యవర్గం



భిక్కనూరు: అంతంపల్లి గ్రామాభివృద్ధి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పిట్ల రాములు, ఉపాధ్యక్షుడిగా జీడి సిద్ధరాములు, కోశాధికారిగా బస్వా రవీందర్ రెడ్డి, డైరెక్టర్లుగా అలకొండ అమృత్‌రెడ్డి, సీహెచ్ రాంరెడ్డి, గోల్కొండ నర్సింహారెడ్డి, కుంట రమేష్ రెడ్డి, పిట్ల శ్రీనివాస్, పుల్లూరి చంద్రం, మైలారపు రాజు, జీడి సిద్దయ్యలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పిట్ల రాములు మాట్లాడుతూ.. ప్రజల సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు.

సమాచారం..

రేపు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ..

ఎల్లారెడ్డిరూరల్: కామారెడ్డి జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఈనెల 19న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు డీసీవో నాగేశ్వర్ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో మిగిలి పోయిన సీట్లకు 19న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నామని, ఆసక్తి గల వారు 19న ఉదయం 9 గంటల వరకల్లా ఎల్లారెడ్డి గురుకుల పాఠశాలలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. అలాగే మూడు సెట్ల జిరాక్సు పత్రాలతో హాజరు కావాలని అన్నారు.

డైట్ కళాశాలల్లో రేపు ..

కామారెడ్డి అర్బన్: డైట్ కళాశాలలో మిగిలిపోయిన సీట్లకు ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం ఈనెల 19న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భర్తీ చేయనున్నట్లు నిజామాబాద్ డైట్ కళాశాల ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాల్లో సీట్ల ఖాళీల వివరాలకు డీఈఈసెట్ వెబ్‌సైట్‌లో చూడవచ్చన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తించదని ఆయన పేర్కొన్నారు.

25న ఓం శాంతి కేంద్రంలో రక్తదాన శిబిరం

కామారెడ్డి అర్బన్: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సోషల్ సర్వీస్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 25న కామారెడ్డి ఓంశాంతి కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు కేంద్రం ఇన్‌చార్జి బీకే జయదీదీ తెలిపారు. రాజయోగిని దాదీ ప్రకాష్‌మణిజీ జ్ఞాపకార్థం రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని ఆసక్తిగల వారు 93973233001, 77588 64822 నంబరుకు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.